ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - పాతపట్నం

ధాన్యం కొనుగోలు విషయంలో టిడిపి కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు దళారులకు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకుని తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడం.. మిల్లర్లు, దళారుల ఇష్టారాజ్యానికి పచ్చజెండా ఊపడం ప్రభుత్వ కుట్రలో భాగమేనని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్లు, రవాణా వాహనాలు లేవని తెలిపారు. రైతు సేవా కేంద్రాలు ఉత్సవ కేంద్రాలుగా మారాయని విమర్శించారు. తుపాను హెచ్చరికలు అన్నదాతల్లో ఆందోళన కలిగిస్తున్నాయని, ప్రభుత్వం మేల్కొని ధాన్యం కొనుగోళ్లను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు.

గంజాయి హాట్‌స్పాట్‌లపై ఉక్కుపాదం

- 65 చోట్ల సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో గంజాయి వినియోగం, అక్రమ రవాణాను సమూలంగా అరికట్టేందుకు అధికారులు గుర్తించిన 65 హాట్‌స్పాట్‌ల వద్ద సిసి కెమెరాలను తక్షణమే ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కెమెరాల ఏర్పాటు బాధ్యతను స్థానిక సంస్థలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా నార్కోటిక్స్ సమన్వయ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 16 మండలాల్లో గంజాయి కార్యకలాపాలకు ఆస్కారమున్న మొత్తం 65 హాట్‌స్పాట్‌లను గుర్తించామన్నారు. శ్రీకాకుళం టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అత్యధికంగా 32 ప్రాంతాల నుంచి మాత్రమే కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయని, మూడు మాత్రమే ఏర్పాటు చేశారని ఎస్‌పి నివేదించినట్లు తెలిపారు. మిగిలిన ప్రతిపాదనలను వచ్చే రెండు రోజుల్లో పంపించి, పనులను సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ హాట్‌స్పాట్‌లో నిత్యం మానిటరింగ్ చేయడం ద్వారా విద్యార్థులు, కూలీలు, డ్రైవర్లు వంటి వారిని లక్ష్యంగా చేసుకుని రవాణాదారులను కట్టడి చేయొచ్చని చెప్పారు.

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ గంజాయి విక్రయం, నిషేధంపై ప్రజల సహకారం కీలకమన్నారు. మాదకద్రవ్యాల సమాచారం వెంటనే డయల్ 112, ప్రత్యేక హెల్ప్‌లైన్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చీకటిగా ఉన్న ప్రాంతాల్లో వెంటనే లైటింగ్ ఏర్పాటు చేయాలని డిపిఒ, మున్సిపల్ కమిషనర్లను కోరారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. 38 ప్రభుత్వ, 67 ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో గంజాయి నివారణ కోసం ఈగల్ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన కల్పించే విషయంలో ఐటిఐ, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలల కృషిని కలెక్టర్ అభినందించారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు ప్రతి శనివారం తప్పనిసరిగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు హోంమంత్రి ప్రారంభించిన పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు 'అభ్యుదయం' సైకిల్ యాత్రలో జిల్లా ప్రజలు, ఆసక్తి గల వారు పాల్గొనాలని ఎస్‌పి కోరారు. రహదారి భద్రతపై నిర్వహించిన సమీక్షలో శ్రీకాకుళం నవభారత జంక్షన్-బైపాస్ జంక్షన్ వద్ద పాదచారుల భద్రత కోసం వెంటనే ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు డిపిఆర్ సిద్ధం చేయాలని ఎన్‌హెచ్ఎఐ పిడికి సూచించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ప్రైవేట్ బస్సులు నిలపకుండా కేసులు నమోదు చేయాలని, రోడ్లపై ఇష్టానుసారం వాహనాలు పార్క్ చేసేవారిపై, జాతీయ రహదారిపై చెత్త వేసినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

థర్మల్ ప్లాంట్‌ను రద్దు చేయాలి

అడ్డూరిపేటలో ప్రతుల దహనం

ప్రజాశక్తి - బూర్జ

వినాశకర థర్మల్ పవర్ ప్లాంట్‌ను రద్దు చేయాలని థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు బి.సురేష్ దొర, కార్యదర్శి ఎస్.సింహాచలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, పోలీసుల నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ థర్మల్ ప్రభావిత గ్రామాల్లో ఈనెల 29 నుంచి డిసెంబరు నాలుగో తేదీ వరకు నిరసన కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని అడ్డూరిపేటలో ప్రతిపాదిత ఇండోసోల్ పవర్‌ప్లాంట్ ప్రతులను శనివారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవర్‌ప్లాంట్‌తో ఆదివాసీల పొట్ట కొట్టొద్దన్నారు.

థర్మల్ పవర్ ప్లాంట్‌తో పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పవర్ ప్లాంట్ పెడితే ఉద్యోగాలు రావని, బూడిద మాత్రమే వస్తుందన్నారు. థర్మల్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకున్నామని ఎమ్మెల్యే కూన రవికుమార్ స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. లేకుంటే వచ్చే నెల 1వ తేదీన పింఛన్ల పంపిణీని సామూహికంగా బహిష్కరిస్తామన్నారు. థర్మల్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ కోశాధికారి రవికాంత్, ఉపాధ్యక్షులు సవర మిన్నారావు, లక్ష్మణరావు, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తల కోసం
www.prajasakti.com
epaper.prajasakti.com

సభ్యుల సూచనలకు ప్రాధాన్యం

జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

స్థాయి సంఘాల సమావేశాల్లో సభ్యుల లేవనెత్తిన సమస్యలు, సూచనలపై అధికారులు దృష్టిసారించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం 1, 2, 4, 7 స్థాయి సంఘ సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించారు. పైడిభీమవరం, పలాస, పాత్రునివలసలో చిన్న పరిశ్రమల ఏర్పాటుకు భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు గురునాథ్ తెలిపారు. పంచాయతీరాజ్ లాగ్ బుక్‌లపై సమస్యలు లేకుండా చూడాలని చైర్‌పర్సన్ చెప్పారు. ఆమదాలవలస నియోజకవర్గంలో రహదారుల వివరాలను ఎమ్మెల్యే కూన రవికుమార్ అడగ్గా, ఆర్ అండ్ బి ఎస్ఇ సత్యనారాయణ వివరించారు. స్పౌజ్ పెన్షన్లు పెండింగ్‌లో ఉన్నాయని వాటిపై తగు చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ చెప్పారు. ఉపాధి హామీ పనులు డిసెంబరు నుంచే ప్రారంభించాలని, ఫీల్డ్ సిబ్బందికి తెలియజేయాలని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. 2012లో రూ.తొమ్మిది లక్షల బిల్లులు అవ్వలేదని చెప్పారు. జాబ్‌కార్డులు లేని వారికి జారీ చేయాలని కోరారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. సరుబుజ్జిలి జెడ్‌పిటిసి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీలో కాలువలు పనులు చేయించక సాగునీరు రావడం లేదని తెలిపారు. ఫీడర్ పనులు చేయిస్తామని డ్వామా పీడీ సుధాకర్ బదులిచ్చారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి ఏ సంవత్సరంలో ఎన్ని పనులు మంజూరయ్యాయి, ఎన్ని పనులు జరిగాయి, ఎన్ని బిల్లులు అయ్యాయో ఆ వివరాలు వచ్చే డిఆర్‌సి సమావేశం నోట్స్‌లో ఉండాలని ఎమ్మెల్యే రవికుమార్ చెప్పారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు గుర్తించాలన్నారు. జలవనరుల శాఖపై ఇరిగేషన్ డెవలప్‌మెంట్ బోర్డు మీటింగ్ ఏర్పాటు చేయాలని, నారాయణపురం రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల నుంచి సాగునీరు విడుదల చేయాలని ఎమ్మెల్యే రవికుమార్ చెప్పారు. కలెక్టర్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని ఎస్ఇ తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా విభాగంపై పనుల పురోగతి, జల జీవన్ మిషన్ పనులను ఇఇ వివరించారు. నియోజకవర్గంలో ఉన్న పనులను గుర్తించి క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బందికి సూచనలు ఇవ్వాలని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. ఉదయం నిర్వహించాల్సిన 6, 3, 5 స్థాయి సంఘాల సమావేశాలు కోరం లేక వాయిదా వేశారు. సీనియర్ అసిస్టెంట్ల నుంచి 18 మంది డిప్యూటీ ఎంపిడిఒలుగా ఉద్యోగోన్నతులు పొందినందుకు అభినందనలు తెలిపారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

నైపుణ్యాభివృద్ధి సంస్థకు రాష్ట్రస్థాయి అవార్డు

శ్రీకాకుళం సిటీ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అందిస్తున్న పలురకాల సేవల్లో రాష్ట్రస్థాయిలో శ్రీకాకుళం జిల్లాకు ప్రథమ స్థానం దక్కింది. విజయవాడలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్‌కు అవార్డును నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బి.శేషారావు అందజేశారు. ఈ అవార్డుతో కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను సాయికుమార్ శనివారం కలిశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. భవిష్యత్‌లో ఇంకా మెరుగ్గా పనిచేయాలని సూచించారు.

జిల్లా కోర్టులో ఉచిత వైద్య శిబిరం

శ్రీకాకుళం : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన జిల్లా కోర్టు భవనంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ప్రారంభించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పనులపై కోర్టుకు వచ్చే ప్రజలు వినియోగించుకోవడం కోసం డిఎల్ఎస్ఎ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు తెలిపారు. డెంటల్, గైనిక్, జనరల్ ఒపి చూసే వైద్యులు పలువురికి వైద్య సహాయం అందించారు.

ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

- సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలి
- సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు

ప్రజాశక్తి - ఆమదాలవలస

డిసెంబరు 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి పిలుపునిచ్చారు. ఆమదాలవలస పారిశ్రామికవాడలో సిఐటియు అఖిల భారత మహాసభల కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. దేశంలో పలు రంగాల కార్మికులు, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మిక వర్గ పోరాటాలను నిర్మించేందుకు సిఐటియు అఖిల భారత మహాసభలు దోహదపడతాయన్నారు. కార్మికవర్గం దశాబ్దాలుగా అశేష త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కార్మిక హక్కులు కాలరాస్తూ 29 కార్మిక చట్టాల స్థానంలో లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని విమర్శించారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పనిగంటలు పెంచుతూ చట్టం చేయడం దుర్మార్గమన్నారు. కార్మికులకు నష్టం చేసి, యాజమాన్యాలకు లాభం చేకూర్చే విధంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండించారు. కనీస వేతన చట్ట ప్రకారం ప్రతి ఐదేళ్లకు పెంచాల్సిన కనీస వేతనం పెంచడం మానేశాయని, ఇప్పటికి మూడుసార్లు పెరగాల్సిన జీతాన్ని కార్మికులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ, ఆశ తదితర స్కీమ్ వర్కర్స్‌కు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ తదితర సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.ప్రకాశరావు, మండల కన్వీనర్ పి.లతాదేవి, పొన్నాడ భూలక్ష్మి, బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు రాజీ చేయాలి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

డిసెంబరు 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. లోక్ అదాలత్ కేసులతో పాటు బెయిల్స్, రానున్న స్థానిక ఎన్నికల దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా పోలీసు కార్యాలయంలో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని న్యాయస్థానాల్లో నిర్వహించే లోక్ అదాలత్‌లో కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, చిన్న క్రిమినల్, ట్రాఫిక్, కాంపౌండు కేసులు వంటి రాజీ సాధ్యమైన కేసులను ముందుగానే గుర్తించాలని సూచించారు. ఇరు వర్గాలతో సంప్రదింపులు చేసి, సానుకూల దక్పథంతో స్వీయ ఒప్పందంతో రాజీకి ప్రోత్సహించాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కేసుల రాజీలో పురోగతిని రోజువారీగా పర్యవేక్షించాలని ఆదేశించారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం శాతం పెరగడం వల్ల ప్రజలకు వేగవంతమైన న్యాయం అందుతుందన్నారు. రాజీ పడదగ్గ కేసు పత్రాల సిద్ధీకరణ వంటి అంశాలు ప్రణాళికాబద్ధంగా, సమన్వయంతో కొనసాగించాలని సూచించారు. రానున్న స్థానిక ఎన్నికల దృష్ట్యా సున్నితమైన, అత్యంత సున్నితమైన గ్రామాలపై ప్రత్యేకంగా నిఘా ఉంచి సమగ్రమైన ముందస్తు చర్యలను పర్యవేక్షించేందుకు జిల్లాలోని గ్రామాల సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామానికి సంబంధించి జనాభా వివరాలు, కమ్యూనిటీ ప్రదేశాలు, ముఖ్యమైన ప్రాంతాలు, ఇదివరకు గొడవలు జరిగే ప్రాంతాలపై సమాచారాన్ని కచ్చితంగా సేకరించాలని తెలిపారు. ముఖ్యమైన కేసుల్లో బెయిల్ విచారణ సమయంలో సంబంధిత పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమన్వయంతో కోర్టులో బెయిల్ వాదనలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. బెయిల్ షరతులు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.వి రమణ, డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద, డి.లక్ష్మణరావు, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

బోధనేతర పనులు వద్దు

ప్రజాశక్తి - కొత్తూరు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మెట్టూరులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూనియన్ మండల కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకొచ్చిందని, ఆ హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయకుండా బోధనేతర పనులు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. బోధనేతర పనులను ఉపాధ్యాయులు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు వల్ల రాష్ట్రంలో లక్ష మంది ఉపాధ్యాయులు టెట్ పరీక్ష రాయాల్సి వస్తోందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ అనేక రాష్ట్రాలు రివ్యూ పిటిషన్లు వేశాయన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ రివ్యూ పిటిషన్ వేస్తామని చెప్పినా, ఇంతవరకు రాష్ట్రం తరుపున వేయలేదన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో టెట్‌పై చర్చించాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే పే రివిజన్ కమిషన్ వేయాలని, తక్షణమే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బకాయి డిఎలు చెల్లించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం సంఘ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎన్.లక్ష్మీనారాయణ, అధ్యక్షులుగా కె.విజయ్‌కుమార్, సహాధ్యక్షులు టి.రవి, డి.స్వర్ణలత, ప్రధాన కార్యదర్శిగా వి.మధుసూదనరావు, కోశాధికారిగా బి.వీరభద్రయ్య, కార్యదర్శులుగా జి.కృష్ణారావు, పి.ధనుంజయరావుతో పాటు 11 మందిని, జిల్లా కౌన్సిలర్లుగా ఏడుగురిని, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పి.దినేష్, అకడమిక్ కన్వీనర్‌గా బి.గణేష్, సిపిఎస్, ఐటి కన్వీనర్‌గా పి.బాలరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జి.మాధవరావు, మండల ప్రధాన కార్యదర్శి వి.మధు, సీనియర్ నాయకులు ఆర్.ఆర్ కొండలరావు, భద్రయ్య, టి.రవి, డి.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరామ్మూర్తి

హక్కులపై ఉక్కుపాదం... రాజ్యాంగంపై ఉపన్యాసం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రాజ్యాంగ దినోత్సవం ప్రజాస్వామ్యానికి పునాది... రాజ్యాంగం కేవలం చట్టపరమైన గ్రంథం మాత్రమే కాదు.. దేశాన్ని ఏకం చేసే శక్తి. అన్ని తరగతుల ప్రజలకు రక్షణగా నిలిచే కవచం. ఉన్నత విలువలు, హక్కులు, బాధ్యతలను మార్గదర్శకం చేసే జీవనవంతమైనా పత్రం ఇవీ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు రాజ్యాంగ దినోత్సవం రోజున ప్రజలకు ఇచ్చిన సందేశం. రాజ్యాంగం గొప్పతనంపై అమాత్యులు పేర్కొన్న అంశాలు నిజమే. కానీ వాటి ఆచరణలోనే అమాత్యుల వారి అసలు నైజం బయటపడుతున్న పరిస్థితి అనేక సందర్భాల్లో కనిపిస్తోంది. ఇటీవల థర్మల్ పవర్‌ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఆదివాసీలు శాంతియుతంగా నిరసన తెలపాలని నిర్ణయిస్తే, వాటిని పోలీసులతో అడ్డుకున్నారు. చట్టాన్ని గౌరవించిన గిరిజనులు ర్యాలీని విరమించుకున్నా ప్రభుత్వం, పోలీసులు మాత్రం వారిని నమ్మలేదు. గ్రామాలపై యుద్ధం ప్రకటించినట్టు వందలాది మంది పోలీసులను మొహరించారు. గిరిజనులు బయటకు రాకుండా కూడళ్లను దిగ్బంధించారు. ప్రముఖుల పర్యటనకు వినియోగించినంత స్థాయిలో పోలీసు బలగాలను ఉపయోగించారు. రోప్ పార్టీలను సైతం రంగంలోకి దించారు. నిర్బంధానికి వ్యతిరేకంగా, శాంతియుతంగా ఆందోళన తెలిపే హక్కును కాలరాస్తున్న ప్రభుత్వం, పోలీసుల తీరు నిరసిస్తూ వెన్నెలవలసలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చేందుకు కొద్దిమందిని అనుమతించిన పోలీసులు, అంతకుమించి వెళ్తారని భావించి ఉదయం ఆరు గంటలకే వామపక్ష నాయకులను గృహ నిర్బంధం చేశారు.

అంతకుముందు కొన్ని వారాల కిందట మందస కార్గో ఎయిర్‌పోర్టు ఆందోళనల విషయంలోనూ ప్రభుత్వం ఇలానే స్థానికుల గొంతును నొక్కే ప్రయత్నం చేసింది. పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టడానికి సిద్ధమవుతున్న వామపక్ష నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేయించింది. ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల ప్రజలను అడుగు తీసి అడుగు వేయనీయలేదు. ఎక్కడికక్కడ పోలీసు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వ్యక్తిగత స్వేచ్ఛను హరించే ప్రయత్నం చేశారు. పలాస టౌన్‌లోనూ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, వాహనాలు తనిఖీ చేస్తూ సామాన్య ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగించారు. ప్రజలకు రక్షణగా రాజ్యాంగం నిలుస్తోందని చెప్తున్న మంత్రి అచ్చెన్నాయుడు.. ఎయిర్‌పోర్టు, థర్మల్ పవర్‌ప్లాంట్ విషయంలో స్థానికుల గొంతును నులిమేయడం ద్వారా తన ద్వంద్వవైఖరిని బయటపెట్టుకున్నారు. శాంతియుతంగా నిరసన తెలపడానికి పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కును కాలరాసి హక్కులు, బాధ్యతలను మార్గదర్శకం చేసే జీవనపత్రం రాజ్యాంగమని వర్ణించడం అమాత్యుల వారికే చెల్లింది.

చట్టాలను అమలు చేసే ఎస్‌పి మహేశ్వరరెడ్డి ప్రసంగ పాఠమూ అలానే ఉంది. భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్యానికి పునాది అని, స్వేచ్ఛ సమానత్వంతో పాటు ప్రజల హక్కుల పరిరక్షణలో చట్ట పాలనను నిలబెట్టడంలో పోలీసులు రాజ్యాంగ స్ఫూర్తిని తమ పని తీరుతో అలవరుచుకోవాలని సందేశమిచ్చారు. సందేశం బాగున్నా ప్రజలపై పలు సందర్భాల్లో వ్యవహరిస్తున్న తీరుతో పోలీసుశాఖ తీవ్ర విమర్శలు పాలవుతోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ధర్నా చేస్తామని చెప్పడమే తరువాయి పోలీసులు వాలిపోతున్నారు. ఆందోళనకారులు పది మంది ఉంటే పోలీసులు డజను మంది బందోబస్తుకు వస్తున్నారు. ఇక కార్గో ఎయిర్‌పోర్టు, థర్మల్ వ్యతిరేక పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఆయా పోరాట కమిటీ నాయకులు నిరసనలకు పిలుపునిస్తే చాలు సరిహద్దులోకి శత్రు దేశాల వారు ప్రవేశిస్తున్నంత రీతిలో పోలీసుల బలగాలను మోహరిస్తున్నారు. కార్గో ఎయిర్‌పోర్టు, థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక ఆందోళనల ప్రజలను గ్రామాలను దాటనీయకుండా పోలీసులతో దిగ్బంధించిన తర్వాత ఎస్‌పి మహేశ్వరరెడ్డి చెప్పిన స్వేచ్ఛ, సమానత్వం ఇంకెక్కడ ఉంటుంది?.

ప్రజాస్వామ్యంలో కనీసం నిరసన తెలిపే హక్కు లేకుండా చేసి, ప్రజల హక్కుల పరిరక్షణలో చట్ట పాలనను నిలబెట్టడంలో సిబ్బంది రాజ్యాంగ స్ఫూర్తితో వ్యవహరించాలని సూచించడం ఆత్మవంచన కాదా?. మంత్రులు, ఎమ్మెల్యేలు చట్టాలు, అందులోని నిబంధనలను చదివి ఉండొకపోవచ్చు, చదవాల్సిన అవసరమూ రాకపోవచ్చు. ఐపిఎస్ అధికారులుగా ఉన్న వారికి రాజ్యాంగంలోని 19(1)(బి) ఏం చెప్తుందో వారికి కచ్చితంగా తెలుస్తుంది. ఎటువంటి ఆయుధాలు లేకుండా శాంతియుతంగా సమావేశమయ్యే హక్కుతో పాటు ప్రభుత్వ చర్యలకు నిరసనగా అసమ్మతి తెలిపే అవకాశాన్నీ పౌరులకు కల్పిస్తోంది. థర్మల్, కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతామని అనుమతి కోరితే, దాన్ని నిర్దద్వందంగా తోసిపుచ్చడం, నిరసన చేపట్టకపోయినా పోలీసులు గ్రామాలను చుట్టుముట్టి ప్రజల స్వేచ్ఛను మింగేయాలని ఏ రాజ్యాంగం చెప్తోంది?.

ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు తమ వారి కోసమో, వేరే ప్రయోజనాల కోసమో ఒక ప్రాజెక్టు లేదా పోర్టును నిర్మించాలని నిర్ణయించవచ్చు. దాని లాభనష్టాలను ప్రజలకు వివరించి వారి సమ్మతితో ముందుకు వెళ్లడం ప్రజాస్వామ్యంలో ఒక విధానం. అలా కాకుండా ప్రజాస్వామ్యంలో రెండో అభిప్రాయానికి తావులేకుండా ప్రజాందోళనలను పోలీసులతో అణచివేయాలని చూస్తే, అది ప్రజలను మరింత రెచ్చగొట్టడమే అవుతుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోతుందని, ప్రజాస్వామ్యానికి చీకటి రోజులు అంటూ అరిచి గోలపెట్టిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారంలోకి వచ్చేసరికి గత పాలకుల వైఖరినే తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. దీన్ని ప్రజలు ఏమాత్రం అంగీకరించరు. వైసిపికి ఇచ్చిన షాక్ ట్రీట్‌మెంట్‌నే టిడిపికి ఇచ్చేందుకూ వెనుకాడరన్న విషయం గుర్తెరగాలి.

ప్రజాశక్తి
www.prajasakti.com

పోలీసులకు కళ్లద్దాలు అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత

ఎస్‌పి కె.వి. మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పోలీసులు సంక్షేమం, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి చెప్పారు. పోలీసు సిబ్బంది కంటి ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని జిల్లా పోలీసు శాఖ చేపట్టిన సంక్షేమ చర్యల్లో భాగంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ కానిస్టేబుళ్లు, ఐటీ కోర్ సిబ్బంది, డిసిఆర్‌బి సిబ్బంది, పోలీసు కార్యాలయ సిబ్బందికి సుమారు 100పైగా కళ్లద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో కంప్యూటర్లు, సిసిటివి మానిటర్లు, టెక్నికల్ పరికరాలు, డేటా ఎంట్రీ పనులు, కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరాలు, స్క్రీన్‌లను ఎక్కువసేపు ఉపయోగించే సిబ్బందిలో కంటి ఒత్తిడి, నీరసం, తలనొప్పి, దృష్టి మందగింపు వంటి సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో పై సమస్యలు తగ్గించడంలో సహాయపడే యాంటీ గ్లేర్ అద్దాలు సిబ్బంది కళ్లను రక్షించడంతో పాటు, దృష్టి స్పష్టతను మెరుగుపరచి, సుదీర్ఘంగా పనిచేసే సామర్థ్యాన్ని పెంచుతాయని తెలిపారు. భవిష్యత్‌లో సిబ్బంది అవసరాలను గుర్తించి మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.వి.రమణ, సిహెచ్‌ఎఒ గోపినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాక్ పార్లమెంట్

ప్రజాశక్తి - పొందూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రిన్సిపాల్ డా.చెవల మధుసూదనరావు ఆధ్వర్యంలో శనివారం మాక్ పార్లమెంటరీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాలకపక్షం, ప్రతిపక్షం పాత్రలను పోషించి పలు శాఖలకు సంబందించిన ప్రశ్నలు, సమాధానాలతో సభను రక్తి కట్టించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన రొటేరియన్ సప్పటి వసంతరావు, ప్రభావతి జాగృతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సభలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు, అధ్యాపకులు కె.సూర్యారావు, ఐ.అప్పారావు, బి.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జిఒ సంఘాన్ని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - కొత్తూరు

ఎన్‌జిఒ సంఘాన్ని బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఎపిఎన్‌జిఒ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా కె.జయరావు, ఐసిడిఎస్ రాధాకృష్ణ వ్యవహరించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, సెక్రెటరీ చల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారిదిగా ఉంటూ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ హక్కుల కోసం పోరాడేటప్పుడు తాలూకా యూనిట్‌లోని ఉద్యోగస్తులంతా సంఘటితంగా ఉండి సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. కొత్తూరు తాలూకా యూనిట్ అధ్యక్షులుగా అల్లు తిరుపతిరావు, సెక్రెటరీ ఇప్పిలి జానకిరామయ్య, ట్రెజరర్ లోకేష్, అసోసి ప్రెసిడెంట్ ఎం.మహేంద్ర కుమార్, వైస్ ప్రెసిడెంట్ నవీన్, జగన్నాథం, చంటిబాబు, జాయింట్ సెక్రెటరీ కృష్ణారావు, నరేష్, రవి కిషోర్, మహిళా జాయింట్ సెక్రెటరీగా రమ్య, ఎలక్షన్ మెంబర్స్‌గా రాజగోపాలరావు, సోమేశ్వరరావు, చామంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా సంఘ నాయకులు ఇరిగేషన్ రాజ్ కుమార్, ఎఎస్‌ఒ బాలరాజు, డిప్యూటీ తహశీల్దార్ మురళీ కృష్ణ, రెవెన్యూ జిల్లా జాయింట్ సెక్రెటరీ గిరీష్ కుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీ

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యంగా జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి కె.అనిత అన్నారు. డిసెంబర్ 1న ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. ప్రస్తుతం హెచ్‌ఐవి నియంత్రణలో ఉందని, హెచ్‌ఐవి రోగులు పౌష్టికాహారం తీసుకోవాలని, ఇతర రోగాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. హెచ్‌ఐవి రోగులకు పూర్తిస్థాయి వైద్యసేవలు అందజేస్తున్నట్లు వివరించారు. ఆరోగ్య సమస్యపై పూర్తిస్థాయిలో వైద్యం చేస్తున్నట్లు చెప్పారు.

ఫుడ్ సేఫ్టీ అధికారిని అడ్డుకున్న షాపు యజమాని

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

మండల పరిధిలో కేశవరావుపేట పంచాయతీ రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో ఉన్న కెడిఎం కిరాణా షాపులో శాంపిల్స్‌ని సేకరించడానికి వెళ్లిన ఎఫ్.ఎస్‌ఒ జి.శ్రీరాములును షాపు యజమాని అడ్డుకొని శాంపిల్స్ తీయొద్దంటూ 20 నిమిషాల పాటు అలజడి చేయగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్థానిక విలేకరులకు, పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేయగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని షాపు యజమానికి వివరించటంతో అధికారులకు సహకరించాడు. ఆహార పదార్థాలు క్రయవిక్రం చేస్తున్న వ్యాపారులు ఆహార భద్రత ప్రమాణాలు, నాణ్యతా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని శ్రీకాకుళం నగర ఆహార భద్రతా అధికారి శ్రీరాములు తెలిపారు. పసుపు, కందిపప్పుతో పాటు మరికొన్నింటిని హైదరాబాదులోని ల్యాబ్‌కు పంపిస్తున్నామన్నారు.

ఆహా ఏమి రుచి..!

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని పాలవలస జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు వడ్డించిన కూరలు భలే రుచిగా ఉన్నాయని విద్యార్థులు తెలిపారు. స్వయంగా పండించిన కూరగాయలను శనివారం ప్రత్యేకంగా వండించి విద్యార్థులకు అందజేశారు. ఆ కూరలు రుచిగా ఉండటంతో ఆహా ఏమి రుచి అంటూ లొట్టలు వేసుకొని స్వీకరించారు. పాఠశాల ప్రాంగణంలో స్వచ్ఛమైన కూరగాయలు పండించడం వలన విద్యార్థులకు పోషక విలువలు ఉండే ఆహారాన్ని అందించడం జరుగుతుందని ఈ ప్రయత్నం చేశామని హెచ్‌ఎం ప్రతాప్ రుద్ర, సూర్యం మాస్టర్ తెలిపారు.

పాఠశాల ఆవరణలో పండించిన కూరగాయలు

ప్రభుత్వ టీచర్లకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - టెక్కలి

విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న ఎన్‌టిఆర్ క్రీడా వికాస కేంద్రం ఆవరణలో ఈ పోటీలు శనివారం నిర్వహించారు. పోటీలను ఎంఇఒలు దల్లి తులసీరావు రెడ్డి, దాసుపురం చిన్నారావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరగతి గదిలో నిరంతరం శ్రమించే ఉపాధ్యాయుల్లో మానసిక ఆనందాన్ని కల్పించేందుకు ఇటువంటి క్రీడలు దోహదపడతాయన్నారు. మండలంలోని పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా టీచర్లకు త్రో బాల్ క్రీడా పోటీలకు ఈ ఎంపికలు చేపట్టారు. జిల్లాస్థాయిలో నిర్వహించే క్రీడల్లో వీరు పాల్గొంటారని ఎంఎస్‌ఒ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో కాపల నారాయణ, రొనంకి గౌరీ ప్రసాద్, కె.రామిరెడ్డిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో మండల స్థాయి వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణ్ రాజా, వెంకటరమణ, శ్యామలరావు, అలివేణి, ఆదిశేషు, భారతి పాల్గొన్నారు.

నరసన్నపేట: ప్రభుత్వ ఉపాధ్యాయులకు డిసెంబర్ 11, 12 తేదీల్లో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ పోటీలకు నరసన్నపేట ఎంఇఒ పి.దాలినాయుడు టీం ఎంపికయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ పోటీలు నిర్వహించారు. అలాగే పోలాకి మండలం రాజారాంపురం క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీల్లో పోలాకి ఎంఇఒ - 2 శ్రీనివాస్ రెడ్డి టీం ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఒ ఎం.నీలం, లక్ష్మణరావు, పిఇటిలు పాల్గొన్నారు.

టెక్కలి : క్రీడా పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

కవిటి: కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల మధ్య మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ప్రారంభించిన మండల విద్యాశాఖ అధికారులు ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ మాట్లాడుతూ పలాసలో జరిగే డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలకు మండలం తరఫున 16 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ పోటీల్లో మండలంలో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందస: మండలంలో పనిచేసిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్లుకు హైస్కూల్ హెచ్‌ఎంలకు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ మర్రిపాటి లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి గోపీచంద్, ఎం.శ్రీనివాసరావు, సత్యజిత్ రాయ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతాంగానికి ప్రభుత్వం పెద్దపీట

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

రైతాంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. శనివారం మండలంలోని తేలుకుంచి పంచాయతీలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతాంగం సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరించారు. రైతులకు రబీ విత్తనాలు పంపిణీ చేశారు. ఎడిఎ భవాని శంకర్, వ్యవసాయశాఖ అధికారులు అజయ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు రైతులకు సాంకేతిక సలహాలు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మణి చంద్ర ప్రకాష్, టిడిపి మండల అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, పిఎసిఎస్ అధ్యక్షుడు పెద్దిన బాబ్జీ, మాజీ సర్పంచ్ మెరుగు సూర్య నారాయణ రెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, ఎంపిడిఒ ప్రభాకరరావు, డిటి సంతోష్ కుమార్, టిడిపి నాయకులు దక్కత ఢిల్లీరావు, సహదేవ్ రెడ్డి, కామేశ్వరరావు, దక్కత రామారావు పాల్గొన్నారు.

అలాగే మండలంలో ఈదుపురంలో అంబటి వీధి మండపం వద్ద రైతన్న మీకోసం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అంబటి. ఈశ్వరరావు, బోర యువరాజు, బోర. రాజేంద్ర ప్రసాద్, అగ్రికల్చర్ అసిస్టెంట్ లోహిత్, అంబటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: డిమాండ్ ఉన్న పంటలవైపు రైతులు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే గౌతు శిరీషా అన్నారు. రాజాంలో నిర్వహించిన రైతన్నా మీకోసంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా 9752485999తో నియోజకవర్గ వాట్సాప్ గవర్నెన్స్ పోస్టర్ విడుదల చేశారు. మాజీ సర్పంచ్ పోతనపల్లి సాంబమూర్తి, రాజశేఖర్, టిడిపి నాయకులు మోహనరావు, విఠల్, హేమబాబు చౌదరి, పిఎసిఎస్ అధ్యక్షుడు కణితి సురేష్ చౌదరి, పుచ్చ ఈశ్వరరావు, అంబటి రామకృష్ణ, నిరంజన్, అధికారులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : రైతన్నా మీకోసం పోస్టర్లను అందజేస్తున్న విప్ అశోక్

మందస: మండలం కొండాలోగాంలో 'రైతన్న మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శిరీష హాజరయ్యారు. కార్యక్రమంలో దుర్యోధన, రాష్ట్ర వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ తాతారావు, అధికారులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని రామచంద్రపురంలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, కోతూరు సర్పంచ్ వసంత కుమారి, మండల గిరిజన నాయకులు భైరిసింగి ధరణి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మంత్రి జిల్లాలో రైతులకు అన్యాయం

పత్తి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని సభ్యుల నిలదీత

లావేరు: జిల్లాకు చెందిన కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవసాయ శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్నా జిల్లా రైతులకు అన్యాయం జరుగుతుందని, ప్రత్తి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నరని మండల సర్వసభ్య సమావేశంలో అదపాక ఎంపిటిసి గంట్యాడ సత్యం వ్యవసాయధికారిని నిలదీయడంతో మిగతా సభ్యులు రైతులకు కూటమి ప్రభుత్వంలో అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ శాఖల వారీగా సమీక్షించగా వ్యవసాయంపై ఎఒ మహేష్ నాయుడు మాట్లాడుతున్న క్రమంలో మండలంలో ప్రత్తి, మొక్కజొన్న పంటలు విరివిగా రైతులు సాగుచేశారని ఇక్కడ మాత్రం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారీలు బారిన పడి నష్టపోతున్నారన్నారు. ప్రత్తిని రాజాంలోని కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్తే శ్రీకాకుళంకు సంబంధించినది ఇక్కడ తీసుకోమని అక్కడ అధికారులు చెప్పడంతో తిరిగి ఇంటికి తీసుకురావడం జరిగిందని ఎంపిటిసి సత్యం సభలో ఆవేదన చెందారు. రైతుసేవా కేంద్రాల్లో ఎక్కడా యూరియా దొరకడం లేదని సభ్యులు ఎఒను నిలదీశారు. రెండురోజుల్లో మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రల్లో యూరియా అందుబాటులోకి వస్తుందని, 2600 మెట్రిక్ టన్నుల యూరియాకు ఇండెంట్ పెట్టడం జరిగిందని చెప్పడంతో సభ్యులు శాంతించారు. మండలంలోని అదపాక టు పొందురు, అదపాక టు చీపురుపల్లి, బుడుమూరు టు తామాడ గ్రామాలకు ఎపిఎస్ ఆర్‌టిసి బస్సు సదుపాయం కల్పించాలని రొక్కం బాలకృష్ణ, సభ్యులు రవాణాశాఖ అధికారులను కోరారు. ఆయా గ్రామ పంచాయతీల తీర్మానం చేసి ఇస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిప్యూటీ సూపరింటెండెంట్ తెలిపారు. గ్రామాల్లో ఇళ్ల మంజూరుకు కూటమి నాయకులు చెప్పినట్టే అధికారులు నడుస్తూ ఇళ్ల మంజూరులో వివక్ష చూపుతున్నారని, పార్టీలకు అతీతంగా మంజూరు చేయాలని జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, సభ్యులు ఎఇ రమేష్‌ను నిలదీశారు. తహశీల్దార్ జిఎల్‌ఇ శ్రీనివాసరావు, ఎపిఒ రెడ్డి సత్యవతి, ఎంపిడిఒ పి. వెంకటారాజు, డిప్యూటీ ఎంపిడిఒ సాయి పద్మజా, ఎంపిటిసి తవిటినాయుడు, బానోజీరావు, శ్రీనువాస రావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

నందిగాం : మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లను కట్టడి చేయాలి

నందిగాం: మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖలో వైసిపి హయాంలో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని దిమిలాడ పిఎసిఎస్ అధ్యక్షులు పి.అజయ్‌కుమార్, ఎస్.జానకిరామ్‌లు ప్రశ్నించారు. ఎంపిపి మాట్లాడుతూ ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి అధికారాన్ని అడ్డం పెట్టుకొని అడ్డుపడుతున్నారన్నారు. రైతులకు ధాన్యం కొనుగోళ్లలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సభ్యులు కోరారు. మండలాన్ని పలాస రెవెన్యూ డివిజన్ నుంచి టెక్కలి రెవెన్యూ డివిజన్‌లో కలపడాన్ని సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఇదే విధంగా టెక్కలిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలనే తీర్మానాన్ని ఎంపిపి ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. గతేడాది ధాన్యం కొనుగోలులో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ ఏడాదైనా అధికారులు స్పందించి సకాలంలో రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లర్ల మోసాలకు రైతులు గురి కాకుండా చూడాలని ఎంపిపి అన్నారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్‌లో పనుల్లో తప్పుడు మస్టర్లు వేసి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు డబ్బులు దోచుకుంటున్నారని గతేడాది ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని, ఈ ఏడాది అలా జరగకుండా చూడకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కుమార్ పట్నాయక్, మండలం ఉపాధ్యక్షులు లక్ష్మీకాంతం, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఎఒను నిలదీస్తున్న అదపాక ఎంపిటిసి సత్యం, సభ్యులు

మండల సర్వసభ్య సమావేశం రసాభాస

మందస: మండలంలో ధాన్యం కొనుగోళ్లలో అంతా అస్తవ్యస్థంగా ఉందని ప్రొక్యుమెంట్ జరిగినా ఇంతవరకు రైతులకు ఎక్కడెక్కడ మిల్లులను కేటాయించారో తెలియని పరిస్థితి అని ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉన్న రైతులు తీవ్ర ఆవేదనతో ఉన్నారని మండల అధికారులకు ఇంతవరకు సమగ్రమైన పరిజ్ఞానం లోపించిందని సభ్యులు అన్నారు. శనివారం ఎంపిపి డొక్కరి దానయ్య అధ్యక్షతన సాదరణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి దానయ్య, వైస్ ఎంపిపి వీరనాగేష్ మాట్లాడుతూ ధాన్యం ప్రొక్యూర్మెంట్ జరిగేటప్పుడు ఒడిశా రాష్ట్రంలో తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆంధ్ర రాష్ట్రంలో ఎక్కువ ధరలకు అమ్ముకున్నట్లు దళారులు రంగ ప్రవేశం జరగకుండా చూడాలని సభ్యులు కోరారు. అనంతరం ఎఒ జ్యోత్స్న స్పందిస్తూ ధాన్యం ప్రొక్యూర్మెంట్లు పారదర్శకత పాటిస్తామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూస్తామన్నారు. కొండలలోగాం ఎంపిటిసి మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా విడుదలైన మినీ గోకులాలను తీవ్రంగా రాజకీయం జోక్యం చేసుకుని ఎమ్మెల్యే సిఫారసుల మేరకే మినీ గోకులను విడుదల చేశారని, ఇటువంటి కేంద్ర పథకాలను కూడా రాజకీయం చేయడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఒ రుసువేశ్వరరావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మందస : మాట్లాడుతున్న ఎంపిపి దానయ్య

2న అరసవల్లి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - అరసవల్లి

వచ్చే నెల 2న అరసవల్లి ఆదిత్యుని హుండీ లెక్కింపు జరుగుతుందని ఆలయ ఇఒ కెఎన్‌విడివి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి హుండీ లెక్కింపు ఉంటుందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

టెక్కలి: టెక్కలి ఎన్‌టిఆర్ క్రీడా వికాస కేంద్రం నుంచి నిర్వహించబడుతున్న కరాటే, తైక్వాండో పోటీల్లో ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి గట్కా పోటీలకు పడాల అభిషేక్ ఎంపికైనట్లు కోచ్ నర్సిపురం శేఖర్ శనివారం తెలిపారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ఈ నెల 29, 30 తేదీల్లో జరగనున్న గట్కా పోటీల్లో అభిషేక్ పాల్గొనున్నట్టు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అభిషేక్, కోచ్ నర్సిపురం శేఖర్‌ను జిల్లా క్రీడాశాఖ అధికారి మహేశ్వరరావు అభినందించారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - నరసన్నపేట

మండలం దూకులపాడు ఎంపియుపి స్కూల్ విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి ఐదు నోట్ పుస్తకాలు, అట్టలు, జామెంట్రీ బాక్స్, పెన్నులను ఉపాధ్యాయుడు టి.కామేష్ కుటుంబ సభ్యులు, బత్తుల స్నేహ (డిజిటల్ అసిస్టెంట్) కుటుంబ సభ్యులు విద్యార్థులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.వి.రమణయ్య, పి.అప్పల నాయుడు, గణిత ఉపాధ్యాయులు కల్పన, దాతల కుటుంబ సభ్యులు స్నేహ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

పోలాకి: మండలంలో జొన్నాం గ్రామంలో ఆక్రమణలను తహశీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్నట్టయితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ స్థల ఆక్రమణలు గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకుని తొలిగించామని తెలిపారు. ఎంపిడిఒ జి.రవికుమార్, డిటి రాజారెడ్డి, ఎస్‌ఐ రంజిత్, విఆర్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మిక చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం రత్తకన్నా హైస్కూల్‌లో యువసూర్య ఛారిటబుల్ ట్రస్టు మాసోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు బాల కార్మికులు చట్టం బాల్య వివాహాలు. పోక్సోచట్టాలపై ట్రస్టు చైర్మన్ న్యాయవాది రాంబాబు అవగాహన కల్పించారు. అనంతరం స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవరాజు, ప్రేమ్ దూలయి, కొరికాన ధర్మరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైవేపై వాహనాలు నిలుపుదల చేస్తే చర్యలు

కోటబొమ్మాళి: మండలం జాతీయ రహదారిపైన, సర్వీసు రోడ్డుల్లో లారీలు, ఇతర వాహనాలు నిలుపుదల చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్థానిక ఎస్‌ఐ వి. సత్యన్నారాయణ తెలిపారు. శనివారం కొత్తపేటకూడలి, పెద్దబమ్మిడి, చిన్నబమ్మిడి, ఎత్తురాళ్ల పాడు వద్ద గస్తీకాసి వాహనదారులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించని వారికి రూ.1000 అపరాధ రుసుం విధించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



గస్తీ కాస్తున్న పోలీసులు

జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విచారణ

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్థికపరమైన లావాదేవీలపై జరిగిన అవకతవకలపై గ్రామానికి చెందిన పైడి విజయ రమణారావు గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం డిప్యూటీ డిఇఒ ఆర్.విజయకుమారి విచారణ జరిపారు. పాఠశాల ఆవరణలో ఫిబ్రవరి 2023లో ఎటువంటి అనుమతులు లేకుండా విలువైన చెట్లును నరికివేసి విక్రయించి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారు. అలాగే పాఠశాల నందు గల పాత ఫర్నిచర్‌ను అమ్మవేసి ఆ సొమ్మును పాఠశాల బ్యాంకు ఖాతాలకు జమ చేయకుండా అవినీతికి పాల్పడ్డారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఆమె ప్రస్తుత హెచ్‌ఎం బల్ల కంటయ్యతో పాటు ఉపాధ్యాయులను విచారణ జరిపారు. అలాగే పాఠశాలలో విరిగిపోయిన ప్రధాన గేట్లు ఎటువంటి అనుమతులు లేకుండా పిఎంసి చైర్మన్‌లకు తెలియకుండా విక్రయించారని, పిఎంసి మీటింగ్‌లు నిర్వహించకపోవడం, స్టాఫ్ మీటింగ్‌లు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ పిఎంసి చైర్మెన్ టి.అమ్మాజీ, వైస్ చైర్మన్ టి.అమ్మినాయుడులు ఆమెకు ఫిర్యాదు చేశారు. వీటిపై జరిపిన విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు డిప్యూటీ డిఇఒ తెలిపారు. ఈ విచారణలో ఎంఇఒ-1 ఎం.వాగ్దేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేపడుతున్న డిప్యూటీ డిఇఒ విజయకుమారి

కవిటి : ప్రారంభిస్తున్న ఎంపిపి కడియాల పద్మా ప్రకాష్

ప్రతిభను వెలికితీసేందుకే క్రీడలు

ప్రజాశక్తి - కవిటి

విద్యార్థుల్లో దాగివున్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని ఎంపిపి కడియాల పద్మా ప్రకాష్ అన్నారు. మండలంలోని రాజపురం ఆదర్శ పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న గ్రిగ్స్ పోటీలను శనివారం ఎంపిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల వసతి గృహం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహంలో అందుతున్న సదుపాయాలు తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మంచినీటి బోరు వేసేందుకు శంకుస్థాపన చేశారు. మరోవైపు రెండు రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో మహిళల జూనియర్ విభాగం ఖోఖోలో ఆదర్శ పాఠశాల రాజపురం, కెజిబివి కొత్తపాలెం ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించగా, సీనియర్ విభాగం మహిళల వాలీబాల్ పోటీల్లో ఆదర్శ పాఠశాల రాజపురం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొరివంక మొదటి రెండు స్థానాల్లో, జూనియర్ వాలీబాల్ విభాగంలో ఆదర్శ పాఠశాల రాజపురం మొదటి స్థానంలో నిలిచాయి. బ్యాట్మెంటన్ మహిళల సీనియర్ విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బిజి పుట్టుగ, జగతి మొదటి రెండు స్థానాలు సాధించగా జూనియర్ విభాగంలో జెడ్‌పిహెచ్‌ఎస్ మాణిక్యపురం, బిజి పుట్టుగ మొదటి, రెండు స్థానాల్లో నిలిచాయి. బాలుర జూనియర్ కబడ్డీ పోటీల్లో పెద్దకర్రివాని పాలెం మొదటి స్థానం కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, మండల విద్యాశాఖ అధికారులు ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ, ప్రిన్సిపాల్ చింతాల గౌతమ్, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య, ఎంపిటిసి ఎస్ కృష్ణారావు, వైసిపి బూత్ కమిటీ అధ్యక్షుడు ఎన్ని అశోక్, వ్యాయామ ఉపాధ్యాయులు బల్లెడ రమేష్, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆటల పోటీలు

బూర్జ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గత రెండు రోజులుగా విద్యార్థులకు జరుగుతున్న మండలస్థాయి ఆటల పోటీలు శనివారం ముగిశాయి. మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాట్మెంట్ సీనియర్ జూనియర్ విభాగాలు పోటీలు నిర్వహించారు. మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి బాల బాలికలు పాల్గొన్నారు. స్పోర్ట్స్ అధికారి నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ పోటీలకు హెచ్‌ఎం లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంఇఒలు శ్యాంసుందర్రావు, ధనంజయరావు, ఎంఎస్‌ఒ సిహెచ్ నారాయణ రావు, పీడీ మన్మధరావు, పిఇటిలు అప్పన్న, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నిబద్ధతే విజయ రహస్యం

ఘనంగా హారికా కన్‌స్ట్రక్షన్ 16 వార్షికోత్సవం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

గత 16 ఏళ్లుగా నగర పాలక సంస్థ పరిధి శ్రీకాకుళం నిర్మాణ రంగంలో ఎంతో బాధ్యతాయుతంగా నిబద్ధతతో పనిచేస్తున్నామని హారికా కన్‌స్ట్రక్షన్స్ అధినేత డాక్టర్ హారికా ప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం సానావీధి తన కార్యాలయంలో 16వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. వార్షికోత్సవ కేకును కట్ చేసి అభిమానులు, సన్నిహితులు, సహచరులతో కలిసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ నిర్మాణ రంగంలో గత సుదీర్ఘ కాలంగా ఎన్నో భవనాలు నిర్మించామని ఇందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బందితో పాటు తన కార్యాలయ సిబ్బంది సహకారం ఎంతో ఉందని స్పష్టం చేశారు. వారందరి సమిష్టి కృషితోనే హారికా కన్‌స్ట్రక్షన్స్ నిర్మాణ రంగంలో రాణిస్తున్నట్లు చెప్పారు. బిపిఎస్ స్కీం అనుసరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, జనసేన నాయకులు పిసిని చంద్రమోహన్, మాజీ కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మాజీ తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, వైసిపి యువనేత ధర్మాన రామనోహర్ నాయుడు, నగర టిడిపి అధ్యక్షులు పాండ్రంకి శంకర్, హర్షవల్లి లయన్స్ క్లబ్ పూర్వపు అధ్యక్షులు కరణం శోభారాణి, హారిక, చంద్రనిహార్, లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు డాక్టర్ పైడి సింధూర, వావిలపల్లి జగన్నాథం నాయుడు, సురంగి మోహన్‌రావు పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న హారికా ప్రసాద్

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్డు ఆమదాలవలస రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం జరిగిన రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జిఆర్‌పి రైల్వేస్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. మధుసూదనరావు తెలిపారు. రైల్వే పోలీసులు అందించిన వివరాల ప్రకారం శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలోని ఊసవానిపేట గేటు సిగ్నల్ పాయింట్ సమీపంలో సుమారు 60 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన్నట్లు తెలిపారు. మృతుని కుడిచేతి మీద పువ్వుగుర్తు గల పచ్చబొట్టు ఉందని, నీలం, తెలుపు, నలుపు రంగు చారలు గల టీ షర్ట్‌తో పాటు తెలుపు, నీలం రంగు గల గళ్ల లుంగీ మృతుడు ఒంటిపై ఉన్నాయన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించిన్నట్లు తెలిపారు. మృతుని వివరాలకు శ్రీకాకుళం జిఆర్‌పిఎస్ రైల్వే స్టేషన్ ఎస్‌ఐ మధుసూదనరావు 9493474582, అలాగే హెడ్ కానిస్టేబుల్ 9110305494 నంబర్లకు సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

పశువులు పట్టివేత

కంచిలి: ఒడిశా బరంపురం నుంచి నారాయణవలస సంతకు మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న పశువులను కంచిలి జాతీయ రహదారి వద్ద శనివారం రాత్రి పట్టుకున్నట్లు కంచిలి ఎస్‌ఐ పారినాయుడు తెలిపారు. మూడు వాహనాల్లో తరలిస్తున్న పది గేదెలు, 11 దూడలను పట్టుకొని వాహనాలను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనాల తనిఖీలు చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకొని కేసునమోదు చేశా మన్నారు. ఈ తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.



వంటకాలను ప్రదర్శిస్తూ అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

కంచిలి: జాడుపూడి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం జరిగిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వంటల్లో నూనె వాడకాన్ని తగ్గిస్తూ పౌష్టికాహార తయారీపై అవగాహన కల్పించారు. ఆర్‌విఎం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమం చేపట్టినట్టు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వాణి కుమారి తెలిపారు. కార్యక్రమంలో బాలికలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని రుచికరమైన వంటకాలను, ఫ్రూట్ సలాడ్లను ప్రదర్శించారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో బాలికలు ముందంజలో ఉండాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కెజిబివి ఉపాధ్యాయ సిబ్బంది, విద్యా కమిటీ సభ్యులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కొత్తూరు: విద్యుత్ లైన్ల పనుల నిర్వహణ నిమిత్తం సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీకాకుళం రోడ్డు, రెల్లివీధి, పారాపురం, కుంచాలపేట, ఒండ్రుజోల, మెట్టూరు, గూనభద్ర, నీలకంఠాపురం, ఉప్పరపేట, ఇరపాడు, గొట్టిపల్లి ప్రాంతాల్లో సరఫరా నిలిపివే యబడునని టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇ.నరసింహకుమార్ ప్రకటనలో తెలిపారు.

మేనేజర్ల నియామకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

69వ నేషనల్ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ అండర్ 14 ఇయర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్ కోచ్, మేనేజర్లుగా ఎపి స్కూల్ గేమ్స్ నుంచి ఉత్తర్వుల మేరకు జిల్లాలో నలుగురు వ్యాయామ ఉపాధ్యాయులను నియమించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో ఎమరాలాడ్ హైట్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ విద్యా సంవత్సరానికి స్పోర్ట్స్ నిర్వహించనున్నారు. డిసెంబర్ 1 నుంచి 4 వరకు ఈ స్పోర్ట్స్ నిర్వహించనున్నారు. బాడాన నారాయణరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాకిపల్లి, టెక్కలి మండలం నడిమింటి నాగరాజు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యామలపేట సంతబొమ్మాళి మండలం. పీరుకట్ల సునీత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బ్రాహ్మణతర్ల పలాస మండలం, సయ్యద్ సాజన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈదుపురం ఇచ్ఛాపురం మండలం నిమించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సలహాదారు పి.సుందరరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు పి.తవితయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.వి.రమణ, జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజేషన్ సెక్రటరీ రమణ, ఆర్.స్వాతి, ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీ ఎం.సాంబ మూర్తి, గ్రిగ్స్ సెక్రటరీ టి.శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ టెక్నికల్ కమిటీ చైర్మన్ కె.హరిబాబు అభినందనలు తెలిపారు.

పలువురికి సేవా పురస్కారాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

నియోజకవర్గంలో కళలు, సాహిత్యం, వైద్య రంగాల్లో సేవలను అందించే వ్యక్తులు ధన్యజీవులని పలువురు వక్తలు అన్నారు. న్యూ హోప్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విభిన్న రంగాల్లో సేవలు అందిస్తున్న వారికీ సత్కరించి అవార్డులు అందించారు. ఇందులో మద్దిలి కేశవరావు సాహిత్య, కళారంగంతో పాటు పాత్రికేయ రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు అవార్డు అందజేశారు. అదేవిధంగా డాక్టర్ దేవేంద్ర రెడ్డి వైద్య రంగంలో ప్రభుత్వ ఆస్పత్రిలో విశిష్టమైన సేవలు అందిస్తున్న నేపథ్యంలో ఆయనకు అవార్డు అందజేశారు. నర్తు గంగయ్య ఉపాధ్యాయుడుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిసూ మహతీ సంస్కృత సేవా సంఘం ద్వారా కళలను పోషిస్తున్నందుకు అవార్డు అందజేశారు. కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా వైసిపి అధ్యక్షులు కె.కె.రాజు, న్యూహోప్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎం.ఎస్.మల్లేశ్వరి, నందమూరి లక్ష్మీ పార్వతి తనయుడు, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కోటేశ్వర ప్రసాద్ వీరగంధం, జాతీయ బిసి జెఎసి కో-ఆర్డినేటర్ నర్తు నరేంద్రయాదవ్, ప్రముఖ వ్యాపారవేత్త సుందరనాథ్, వైసిపి మహిళా విభాగం కార్యదర్శి బల్లాడ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక దారుఢ్యం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

క్రీడలతో శారీరక మానసిక దారుఢ్యం సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ ఎన్. రమేష్ అన్నారు. స్థానిక జ్ఞానభారతి పాఠశాలలో కార్యదర్శి, సిఇఒ జోహార్ ఖాన్ అధ్యక్షతన 41వ వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ హాజరై సిబిఎస్ఇ క్రీడా పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడాకారులకు అందించారు. క్రీడాకారుల జట్ల నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్రీడల ప్రాధాన్యతను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. క్రీడలతో శారీరక, మానసిక దారుఢ్యం సాధ్యమవుతుందన్నారు. జ్ఞాన భారతి సెక్రటరీ జోహార్ ఖాన్ మాట్లాడుతూ ప్రతి ఏడాది పాఠశాలలో క్రీడా దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. విద్యార్థుల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేలా క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ కె.అప్పారావు, ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి పండ, మేనేజర్ ప్రమోద్ కుమార్, పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌ఫోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్ కుమార్ పండా, డి రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాల క్రమబద్ధీకరణకు బిపిఎస్ వరం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పురపాలక సంఘంలో 1985 జనవరి 1 నుంచి 2025 ఆగష్టు 31 మధ్యలో అనుమతి లేకుండా, నిభందనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలు క్రమబద్ధీ కరించుకోవడానికి ప్రభుత్వం బిపిఎస్ పథకం తీసుకువచ్చిందని, సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా చేకూరే ప్రయోజనాల కోసం ప్రజలు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారని, అటువంటి వారికి ఇది వరం లాంటిందన్నారు. అక్రమంగా నిర్మించిన భవన నిర్మాణదారులు, అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన భవన యజమానులు దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలన్నారు. దరఖాస్తుదారుడు రిజిస్టర్డ్ సేల్ డీడ్ కాపీ, ఇసి, మార్కెట్ విలువను ధ్రువీకరించే పత్రం, ప్లాను ఉంటే అనుమతి పొందిన ప్లాను కాపీ గుర్తింపు పొందిన సాంకేతిక పర్సన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

టిడిపి నాయకుల హర్షం

ప్రజాశక్తి- నందిగాం

వైసిపి హయాంలో నందిగాం మండలాన్ని పలాస రెవెన్యూ డివిజన్‌లో కలిపారు. దానిని గుర్తించి టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్‌లో కలిపేందుకు ప్రత్యేక జిఒ తెచ్చి కలపడం హర్షించదగ్గ విషయమని దీనికి కృషి చేసిన రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

కృష్ణదాస్ పరామర్శ

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలం జమ్ము జగనన్న కాలనీలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న పొట్నూరు జగదీశ్వరరావు, పట్టిల చిరంజీవిలను శనివారం వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ డిప్యూటీ సిఎం ధర్మాన కృష్ణదాస్ పరామర్శించారు. ఈయనతో పాటు రాష్ట్ర కళింగ అనుబంధ విభాగాల అధ్యక్షులు ఆరింగి మురళీధర్, మాజీ సుడా చైర్మన్ కోరాడ చంద్ర భూషణ గుప్తా, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు సురంగ నరసింహారావు, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి కనపల శేఖరరావు, మండల బూత్ కమిటీ అధ్యక్షులు బొబ్బది ఈశ్వరరావు, ఎంపిటిసి నేతింటి రాజేశ్వరరావు, వార్డుమెంబర్ బంకుపల్లి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న కృష్ణదాస్

ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - గార, శ్రీకాకుళం రూరల్

ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలందించడమే ప్రభుత్వ ధ్యేయమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. గార మండలంలోని వమరవల్లి డైట్ పాఠశాలలో అదనపు భవనాలకు రూ.2.4 కోట్లు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తయిన అదనపు తరగతి గదులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. నూతన భవనాల్లో ఏర్పాటు చేసిన వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇదే ప్రాంగణంలో ఆడిటోరియం, రెండు డార్మిటరీలు గ్రౌండ్ ఫ్లోర్‌లో అన్ని వసతులతో కూడిన నాలుగు గదులు, మొదటి అంతస్తులో నాలుగు గదుల డిజైన్‌తో రూ.6.06 కోట్లతో నిర్మిస్తున్న భవన సముదాయానికి కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఉపాధి హామీ రూ.40 లక్షలతో గార మండల కేంద్రంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని చాపురం, పాత్రునివలస గ్రామాల్లో రోడ్ల ప్రారంభోత్సవంలో పాల్గొనడంతో పాటు డ్రైన్ల

నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శ్రీకాకుళం నగరంలోని పిఎస్ఎన్ఎం పాఠశాల ఎదురుగా రోడ్డుతో పాటు కీ.శే కింజరాపు ఎర్రన్నాయుడు పేరుతో నిర్మించిన పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ సర్కారు తోడ్పాటుతో రాష్ట్రం రెట్టింపు వేగంతో మరింత అభివృద్ధి వైపు పయనిస్తోందన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిసి పి.వేణుగోపాలరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు, డైట్ ప్రిన్సిపాల్ ఎ. గౌరీశంకరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ శతాబ్ది ఉత్సవాలకు తరలిరావాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సిపిఐ స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జనవరి 18న ఖమ్మం పట్టణంలో జరిగే భారీ బహిరంగ సభకు జిల్లాలో పార్టీ శ్రేణులు తరలి రావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ శతాబ్దిక పోరాట గాథలు, కార్మిక-రైతు ఉద్యమాల్లో చేసిన త్యాగాలను స్మరించుకునే విధంగా భారీ ఎత్తున ప్రజలను సమీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలు, ప్రజాసంఘాలు, కార్మిక వర్గాలు పెద్ద ఎత్తున సభకు తరలిరావాలన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువత, రైతులు, విద్యారంగానికి చేసిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కావడం లేదన్నారు. పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి రెండు సంవత్సరాలు గడిచినా ప్రభుత్వం దానిపై ఎలాంటి నిర్ణయం

మాట్లాడుతున్న వెంకట రమణ

తీసుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. అంతర్జాతీయ కార్మిక చట్టాల ఉల్లంఘనకు, కార్మికులకు ఎక్కువ గంటలు పనిచేయించే వ్యవస్థకు సిపిఐ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాలిన నారాయణస్వామి, పి. ఆరేలమ్మ, బొత్స సంతోష్, జిల్లా సమితి సభ్యులు సిహెచ్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ అధికారిని మార్చాలి

టెక్కలి: సీతంపేట ఐటిడిఎలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టిన అధికారిని తక్షణమే మార్చాలని పలు దళిత సంఘాలు, కుల సంఘాలు, డిమాండ్ చేశాయి. శనివారం టెక్కలి సభ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో సమావేశాన్ని నిర్వహించారు. సీతంపేట ఐటిడిఎ కార్యాలయంలో అవినీతి జరిగిందని ఎపిఒ, డిడిలకు వత్తాసు పలికే ట్రైకర్ జనరల్ మేనేజర్ మణికుమార్‌ని విచారణ అధికారిగా నియమించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ నెల 26న చేపట్టిన విచారణ స్వార్థంతో కూడుకున్నదని, రాజ్యాంగ దినోత్సవం రోజున విచారణ వద్దని తాము కోరితే అదే రోజు విచారణ చేపట్టడంలో గల ఔచిత్యం ఏమిటని ప్రశ్నించారు. అవినీతికి పాల్పడ్డ ఎపిఒ చిన్నబాబు, డిడి అన్నం దొరపై 23 ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేశామని, అయితే దీనిపై విచారణ అధికారిగా నియమించబడ్డ మణికుమార్ ఎపిఒ, డిడిలతో మిలాకత్ కావడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ట్రైకర్ మేనేజర్ అండతోనే వీరు అవినీతికి పాల్పడ్డారన్నారు. టెండర్లు లేకుండా లక్షలాది రూపాయల వ్యయంతో వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేశారని, నిబంధనలకు విరుద్ధముగా అనేక పనులు చేపట్టారని ఇటువంటి వాటిపై విచారణ జరపాలని ఫిర్యాదు చేస్తే ఇంతవరకు చర్యలు లేవని కావున విచారణ అధికారిని తక్షణమే మార్చి కొత్తగా మరో అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పి దానేష్, దేశభక్త ప్రజాతంత్ర జిల్లా అధ్యక్షులు సాలిన వీరస్వామి, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకరరావు, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్‌తో పాటు అంబేద్కర్ యువజన సంఘం నాయకులు రాకోటి రాంబాబు, కూర్మారావు, వైకుంఠరావు, వెంకట్రావు, దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల పంపిణీ

ప్రజాశక్తి- రణస్థలం

మండలం కొండములగాంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులతో కలిసి శనివారం అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా లబ్ధి పొందన రైతుల వద్దకు వెళ్లి అన్నదాతల కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పోస్టర్ల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా సిఎం చంద్రబాబు నాయుడు పరిపాలనలో సూపర్ సిక్స్ పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా అన్నదాతల సంక్షేమానికి అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పి రెండు విడతలు రైతుల ఖాతాల్లో

పోస్టర్లు పంపిణీ చేస్తున్న ఎంపీ అప్పలనాయుడు

జమచేశారన్నారు. అలాగే ఆధునీకర పద్ధతిలో సేంద్రియ వ్యవసాయం చేసే విధంగా రైతన్నలకు సబ్సిడీ రూపంలో వ్యవసాయానికి సంబంధించి డ్రోన్లు, ట్రాక్టర్లు, మోటార్స్, బోర్ వెల్స్ తదితర వాటిపై సబ్సిడీ ఇచ్చి రైతుల సంక్షేమంపై ప్రభుత్వం చేస్తున్న కృషి హర్షనీయమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలను చెల్లించాలి

మాట్లాడుతున్న జనార్ధనరావు

ఆమదాలవలస: రిటైర్డ్ పెన్షనర్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయ సమీపంలో సంఘ అధ్యక్షులు సురవరపు సిమ్మినాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధనరావు మాట్లాడుతూ 12వ పిఆర్‌సిని వెంటనే నియమించి 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ 'పెన్షన్ వ్యాలిడేషన్' బిల్లును ప్రవేశపెట్టి పెన్షనర్ల హక్కులను కాలరాయాలని చూస్తుందన్నారు. కోశాధికారి హెచ్‌వి సత్యనారాయణ మాట్లాడుతూ ఇహెచ్‌ఎస్ సౌకర్యాన్ని రిటైర్డ్ పెన్షనర్లకు కల్పించకుండా వైద్యసేవలు సక్రమంగా అందకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘ నాయకులు డి.లక్ష్మణరావు, ఎన్.చంద్రశేఖరరావు, కె.షణ్ముఖరావు, బి.వి.రమణ, పి.వి.నరసింహులు, పి.బానోజీరావు. కె.జనార్ధనరావు, కె.సంజీవరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సుచిత్ర గాత్ర సౌరభం

ప్రజాశక్తి- అరసవల్లి

ఆరామ ద్రావిడ సంఘం, శ్రీ సుమిత్ర కళా సమితి ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో ఇప్పిలి జోగారావు 102వ జయంతి ముగింపు వేడుకలు శనివారం చెన్నైకి చెందిన సుచిత్ర బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో గాత్ర సౌరభవం ఎంతగానో అలరించింది. ఈ కార్యక్రమంలో వయోలిన్ మావుడూరు సత్యనారాయణ శర్మ, మృదంగం మావుడూరు సూర్యప్రసాద్ శర్మ, ఘటం బంకుపల్లి శ్రీనివాస శర్మ వాయిద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా గాయకులు కరి యామిని కృష్ణ, సంగీత కళాకారులు పెంకి నాగేశ్వరరావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొంఖ్యాన మురళీధర్, పొగిరి సుగుణాకర్ రావు, వరద వెంకట

సన్మానిస్తున్న ప్రతినిధులు

ఆనంద్, సుసరావు, గణపతి శర్మ , రేజేటి వరప్రసాద్ శర్మ నిక్కు అప్పన్న, రంప జగదీశ్వరరావు తదితరులు మాట్లాడుతూ సంగీత కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందకరమని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పిలి శంకర్ శర్మ, గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు, సురేష్, మండవల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఈనెల 24, 25, తేదీల్లో పల్నాడు జిల్లా వినుకొండ లైలా ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు జరిగాయి. మండలంలోని కరజాడ పాఠశాలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా పోల్వాల్ట్ జంప్ అండర్ -17 అథ్లెటిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానాన్ని మాగపాటి టెండూల్కర్, (10వ తరగతి), తృతీయ స్థానాన్ని గుణ శ్యాంసుందర్, (10వ తరగతి) పొందారు. జాతీయస్థాయి పోటీలకు మాగపాటి టెండూల్కర్ ఎంపికయ్యాడు. అలాగే లండ లిఖిత 1500 మీటర్ల పరుగు పందెంలో ఆరవ స్థానంలో నిలిచింది. వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ దాసరి దీనబంధు, ప్రతిభ సాధించిన విద్యార్థులకు హెచ్‌ఎం టి.వి.రమణమూర్తి, ఉపాధ్యాయులు టి.గోపాల కృష్ణ, ఆదినారాయణ, సి యతి

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాజారావు, పి.రామారావు, ఎస్ దాస్, స్టాఫ్ సెక్రటరీ ఎల్. వెంకటా చలం, నారాయణరావు, పి.ప్రమీల, పుష్ప కుమారి, బోధనేతర సిబ్బంది సింహాచలం, పుష్పలత, సీమ జగదీష్, కిరణ్ శనివారం పాఠశాలలో అభినందించారు.

సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్నకిరణ్ కుమార్

వైద్య విద్యార్థులకు ప్రభుత్వం అన్యాయం

లావేరు: పిపిపి పేరుతో పేద వైద్య విద్యార్థులకు కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. శనివారం వెంకటాపురం కూడలిలో మెడికల్ కాలేజీల ప్రేవేటికరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కూడలిలో ఇంటింటికి, దుకాణాల వద్దకు వెళ్లి ప్రజల నుంచి సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిపిపి పేరుతో పది నూతన కాలేజీలు ప్రవేటికరించాలని ప్రభుత్వం కుటిల నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వ నిర్వాకం వలన ఉచిత వైద్యసేవలు దూరమై పెదరోగులు, పేద వైద్య విద్యార్థులు మెడికల్ సీట్లు కోల్పోయి నష్టపోతారని ఆవేదన చెందారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు బురాడ చిన్నారావు, గొర్లె అప్పలనాయుడు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సెక్బాన్ బాషా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఎచ్చెర్ల మండలశాఖ మహాసభ తన్మె ఫంక్షన్ హాల్‌లో జి.అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నూతనకమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొందూరు అప్పారావు, జిల్లా కార్యదర్శి జి.శ్రీరామచంద్రమూర్తి, కె.రామారావు, సీనియర్ ఉపాధ్యాయులు జి.శ్రీరంగనాయకులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారిగా జి.సురేష్ కుమార్, ఎన్నికల పరిశీలకులుగా ఎస్.స్వర్ణకుమారి వ్యవహరించారు. గౌరవ అధ్యక్షులుగా కె.సూర్యనారాయణ, అధ్యక్షులుగా సిహెచ్ రామారావు,

ఎన్నికైన నూతన కమిటీ

సహాధ్యక్షులుగా జి.అజయ్ కుమార్, ఎస్.స్వర్ణలత, ప్రధాన కార్యదర్శిగా జి.రమేష్ కోశాధికారిగా కె.వసంత్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా డి.చిన్నబాబుతో పాటు 12 మంది కార్యదర్శులను, 13 మంది జిల్లా కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి ఆర్థికసాయం

రణస్థలం: మండలంలోని బండిపాలెంలో ఎండ ఉగాది ఇళ్లు పూర్తిగా కాలిపోయింది. ఉగాది కుటుంబ సభ్యులను రణస్థలం ఎంపిటిసి ప్రతినిధి మజ్జి రమేష్ శనివారం పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో చందక రమణ, గొర్లె హరి, వాలి రమణ, వాలి రామునాయుడు, పచ్చిపాల చంటి, లుకలాపు దుర్గారావు, పైడిపల్లి పండు, సన్యాని శంకర్రావు గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- సారవకోట

మండల కేంద్రంలో జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడి కారణంగా ప్రతిఒక్కరూ వ్యాధుల బారిన పడుతున్నారని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఉచితంగా వైద్యశిబిరాన్ని నిర్వహించిన జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది సేవలను కొనియాడారు. అనంతరం రక్తదానం చేసిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న షేక్‌స్పియర్ డ్రామా

ప్రజాశక్తి- కవిటి

రాజ్యాంగ వారోత్సవాల భాగంగా కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో శనివారం నిర్వహించిన ద మర్చంట్ ఆఫ్ వెనిస్ డ్రామా ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కోర్టు సీన్‌లో విద్యార్థులు బేసినియో, ఆంటోనియో, షైలాక్ పాత్రలను చక్కగా పోషించారు. లాయర్, జడ్జి పాత్రల్లో విద్యార్థుల నటన ప్రేక్షకులను మెప్పించింది. అనంతరం ప్రిన్సిపాల్ బిందు మాధవి, ఎఒ రాణి మాట్లాడుతూ చదువుతో పాటు ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొంది స్తాయని, మనోవికాసానికి దోహదం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి రవీంద్రను కలిసిన శంకర్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

గనులు, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్రను విజయవాడ క్యాంపు కార్యాలయంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో బిసి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రెడ్డిక వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా తమ సామాజిక తరగతికి మేలు జరిగేలా కృషి చేస్తానని మంత్రికి స్పష్టం చేశారు.

పంటలు పరిశీలన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని అడ్డంగి గ్రామంలో ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ జిఎస్ రాయ్, డాక్టర్ సిహెచ్ బాలకృష్ణ, డాక్టర్ హరికుమార్, డాక్టర్ కిరణ్ కుమార్ లు శనివారం పంట పొలాలను, తోటలను పరిశీలించారు. సేంద్రియ పద్ధతిలో వరి సాగు విధానం, అల్లంలో మహిమా రకం ప్రదర్శన, పందిరి చిక్కుళ్లు అర్కా కృష్ణ, ఆర్కా స్వాగత్ వంటి రకాల పరిశీలన క్షేత్రాలను సందర్శించారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ ఏరియా కో-ఆర్డినేటర్ సవర ఆనందరావు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- నందిగాం

మండలం నరేంద్రపురం ప్రైమరీ స్కూల్లో ఐసిడిఎస్ సిడిపిఒ ఎస్.విద్య పిల్లలకు చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ 100, ఉమెన్ హెల్ప్ లైన్ 181, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సెల్‌ఫోన్ వినియోగంపై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమలో ప్రైమరీస్కూల్ టీచర్ కె.లక్ష్మి, సూపర్‌వైజర్లు శారద, జలజాక్షి, సావిత్రి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని యరగాం, బప్పడాంలో పలువురు టిడిపి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి గురువు తిరుమలరావు, టిడిపి నాయకులు గోవిందరావు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి- కంచిలి

గ్రామీణ రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని టిడిపి మండల అధ్యక్షులు మాదిన రామారావు అన్నారు. మండలంలోని కొన్నాయి పుట్టుగలో రూ.4 లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారులతో పాటు మౌలిక వసతుల కల్పనపై అధిక దృష్టి సారిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు శ్రీను, భైరవ్, భగవాన్, రత్నాకర్, రూప్ చందు పాల్గొన్నారు.